సమరానికి సర్వం సిద్ధం

- శేరిలింగంపల్లిలో ఏర్పాట్లు పూర్తి
- 633 పోలింగ్ కేంద్రాలు
- విధుల్లో 3వేల మంది సిబ్బంది
- గచ్చిబౌలి స్టేడియంలో ఈవీఎంల పంపిణీ
- 140 బస్సుల్లో సిబ్బంది తరలింపు
- ఓటు హక్కు వినియోగించుకోవాలి: ఏఆర్ఓ స్నేహ శబరీష్
- డీఆర్‌సీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ శశాంక

గచ్చిబౌలి స్టేడియంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో సాధారణ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఆర్ఓ, జెడ్పీ స్నేహ శబరీష్

గచ్చిబౌలి స్టేడియంలోని ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

శేరిలింగంపల్లి, మే 12: సాధారణ ఎన్నికల నిర్వహణ సజావుగా నిర్వహించేందుకు శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో సర్వం సిద్ధం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 7,58,102 మందితో అత్యధిక ఓటర్లు కలిగిన నియోజకవర్గం కావడంతో అదేస్థాయిలో విస్తృతస్థాయి ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం గచ్చిబౌలి బాలయోగి క్రీడాస్టేడియంలో శేరిలింగంపల్లి ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ పర్యవేక్షణలో సిబ్బందికి ఈవీఎంలు అందజేశారు. మొత్తం 633 పోలింగ్ కేంద్రాలను అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కేంద్రాలన్నింటిలోనూ అవసరమైన వసతులు తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు వంటి సౌకర్యాలు కల్పించారు. మొత్తం 3వేల మంది సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. 633 పోలింగ్ కేంద్రాలను 57 సెక్టార్లు(రూట్లు)గా విభజించి ఈవీఎంలు అందజేసి పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఒక్కో సెక్టార్ అధికారుల నియామకంతోపాటు పోలింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు(పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు(ఏపీవో), రిజర్వు అధికారులు, వలంటీర్లు ఒక్కో పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉంచారు. ఆదివారం రాత్రికి పోలింగ్ అధికారులు, సిబ్బంది తమ తమ పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతోపాటు చేరుకుంటారని, సోమవారం ఉదయం 5:30 గంటలకు పోలింగ్ కేంద్రాల్లో ఆయా ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్‌ను నిర్వహించనున్నట్లు ఏఆర్ఓ స్నేహ శబరీష్ తెలిపారు. అనంతరం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రంలో లోపల, బయట లైవ్ టెలికాస్ట్ వెబ్ కెమెరాలు అమర్చినట్లు తెలిపారు. దీంతో పాటు బయట పోలింగ్ కేంద్రాల వద్ద దాదాపు 156 ప్రాంతాల్లో ప్రత్యేకంగా కెమెరాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈవీఎంలు మొరాయించిన, సాంకేతిక ఇబ్బందులు తలెత్తిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా పలువురు ఇంజినీర్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఉంటుందని, సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల్లో ఓ సబ్‌ఇన్స్పెక్టర్‌తో పాటు పోలీస్ సిబ్బంది బందోబస్తు ఉంటారని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలతో పాటు కీలక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో మైక్రో పర్యవేక్షకులు, వెబ్ క్యాస్టింగ్, వెబ్ రికార్డింగ్ నిపుణులను అందుబాటులో ఉంచామన్నారు. ఐదేండ్లకు ఒక సారి వచ్చే ఓటు హక్కు అవకాశాన్ని ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని శేరిలింగంపల్లి ఏఆర్ఓ స్నేహ శబరీష్ అన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌తో అనుమతి లేదు. ఓటర్లు సెల్‌ఫోన్‌తో పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు వస్తే ప్రవేశం ఉండదని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ గచ్చిబౌలిలోని డీఆర్‌సీ కేంద్రాన్ని పరిశీలించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన బందోబస్తు వివరాలపై చర్చించారు.

కేంద్రాన్ని పర్యవేక్షించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్

గచ్చిబౌలి స్టేడియంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆదివారం పోలింగ్ కేంద్రాల అధికారులు, సిబ్బందికి ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పర్యవేక్షించారు. స్టేడియంలో శేరిలింగంపల్లి ఏఆర్ఓ స్నేహ శబరీష్‌తోపాటు ఇతర అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలు, సిబ్బందికి ఈవీఎంల అందజేత ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు, బందోబస్తు విషయాలపై ఈ సందర్భంగా ఆయన ఆరాతీశారు.

ఈవీఎంల పంపిణీని గచ్చిబౌలి స్టేడియంలో పరిశీలిస్తున్న సైబరాబాద్ జాయింట్ పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మే 12: పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల హక్కుల కోసం పోరాడాలంటే బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్, బీజేపీ నేతల మాయమాటలు నమ్మొద్దు. తెలంగాణ బంగారు భవిష్యత్ కోసం బీఆర్ఎస్‌ను ఆదరించాలి. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించింది. పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో 70 ఏండ్లలో పరిష్కారం కాని సమస్యలను 10 ఏండ్ల కాలంలోనే పరిష్కరించాం. కులాలు.. మతాలు అంటూ ఉగ్గేదంతో కాకుండా విజ్ఞతతో ఆలోచించి కారు గుర్తుకే ఓటెయ్యాలి. మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి. నియోజకవర్గంలో ఓటర్లందరూ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని కోరుతున్నాను.

– మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్యే, కూకట్‌పల్లి

ఓటును వినియోగించుకోండి

ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలి. నేడు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పోలింగ్ ప్రక్రియలో ఓటర్లందరూ భాగస్థులు కావాలి. ఓటు హక్కు అధికారాన్ని, బాధ్యతను కలుగజేస్తుందని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకుని ఓటరుగా గర్వించాలి. పోలింగ్ డేను సెలవు దినంగా భావించకుండా... ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలి. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి..పదేండ్ల కాలంలో కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దని, చేసిన అభివృద్ధిని చూసి మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ఆశీర్వదించాలి. కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరుతున్నాను. **– కుర్మయ్యగారి నవీన్‌కుమార్, ఎమ్మెల్సీ, కూకట్‌పల్లి**

ప్రగతికి పట్టం కట్టండి..

పదేండ్ల కాలంలో జరిగిన ప్రగతికి పట్టం కట్టాలి. బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలి. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ల సహకారంతో స్థానిక ఎమ్మెల్యే కృష్ణారావు ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీలో ఫ్లైఓవర్లు, పార్కులు, క్రీడా ప్రాంగణాలు, మోడల్ రైతుబజార్, ఫిష్ మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయి. కాలనీలలో పురాతన కాలంనాటి రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ సమస్యలు పరిష్కారమయ్యాయని.. ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి ఫలాలు చేరాయన్నారు. అభ్యున్నతి కోసం పనిచేసిన బీఆర్ఎస్‌ను ఆదరించాలని, కారు గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. **– మందడి శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్, కేపీహెచ్‌బీ కాలనీ**

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి..

అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, ప్రజలందరి మేలు కోసం పనిచేసే బీఆర్ఎస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఆశీర్వదించాలి. మాజీ సీఎం కేసీఆర్ సుపరిపాలన కారణంగానే రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతిని సాధించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయి. బాలాజీనగర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పార్కులు, క్రీడా ప్రాంగణాలు, చెరువుల అభివృద్ధి, కాలువల పునరుద్ధరణ పనులు జరిగాయి. చేసిన పనులకు కృతజ్ఞతగా బీఆర్ఎస్‌ను ఆదరించి.. కారు గుర్తుకు ఓటేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలి. **– పగడాల శిరీషాబాబూరావు, కార్పొరేటర్, బాలాజీనగర్**

మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగరేద్దాం..

మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగరాలంటే... ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలి. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ సుపరిపాలనతో నగరం విశ్వనగరంగా అభివృద్ధిని సాధించింది. కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు కృషి ఫలితంగా నియోజకవర్గంలోని సమస్యలన్నీ పరిష్కారం అయ్యాయి. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలి. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీని అందించాలి.

– జూపల్లి సత్యనారాయణ, కార్పొరేటర్, కూకట్‌పల్లి

- 153 లొకేషన్లు.. 417 పోలింగ్ బూత్‌లు.. 4.82 లక్షల ఓటర్లు..
- ఎన్నికల ప్రక్రియలో 2వేలకు పైగా సిబ్బంది

కూకట్‌పల్లిలో పకడ్బందీ ఏర్పాట్లు

పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలతో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

కేపీహెచ్‌బీ కాలనీ, మే 12: మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఘట్టాన్ని ప్రశాంతంగా.. పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీస్ (ఏఆర్‌వో) అభిలాష అభినవ్ తెలిపారు. ఆదివారం జేఎన్‌టీయూహెచ్‌లో ఈవీఎంలు, ఎన్నికల నిర్వహణ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గానికి చెందిన తుది ఓటరు జాబితాను ప్రచురించడంతో పాటు పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, వాటిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. ఈవీఎం మిషన్లు, వీవీప్యాట్లను అనుసంధానం చేయడం ద్వారా ఓటు వేసిన వెంటనే ఏ అభ్యర్థికి ఓటు వేశామో వెంటనే వీవీప్యాట్ ద్వారా నిర్ధారించుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

4.82 లక్షల ఓటర్లు..

కూకట్‌పల్లి నియోజకవర్గంలో తుది ఓటరు జాబితా ప్రకారం 4,82,056 మంది ఓటర్లు ఉన్నారు. 2,51,424 మంది పురుషులు, 2,30,506 మంది స్త్రీలు, ఇతరులు 126 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం పరిధిలో 153లొకేషన్లు(బిల్డింగ్)లో 417 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో 93 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో 2వేలకు పైగా సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక వీల్‌చైర్లు, ర్యాంపుల నిర్మాణం, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు.

సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్..

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనున్నది. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల దూరం బయటే ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాల్సి ఉంటుందని పోలీసులు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌తో రికార్డు చేయడం జరుగుతుందని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా పెట్టామని, ఎక్కడా అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్తులై బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలి.నియోజకవర్గంలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఇప్పటికే ఇంటింటికి పోలింగ్ ఓటరు స్లిప్పులను పంపిణీ చేశాం. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఇప్పటికే దివ్యాంగులు, వృద్ధులు కలిపి 23 మంది ఇంటి వద్ద నుంచి ఓటు హక్కును వినియోగించుకోగా..1263 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నేటి పోలింగ్ రోజును సెలవు దినంగా భావించకుండా బాధ్యతగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటరు జాబితాలో పేరున్న ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని కోరుతున్నాం.

– అభిలాష అభినవ్, ఏఆర్‌వో, కూకట్‌పల్లి నియోజకవర్గం

శేరిలింగంపల్లిలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవోలు

ఓటింగ్ శాతం పెంపుపై ఆశలు

మియాపూర్, మే 12:పార్లమెంటు ఎన్నికలు సోమవారం జరగనున్న నేపథ్యంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో సర్వం సిద్ధమైంది. నియోజకవర్గంలో 633 పోలింగ్ కేంద్రాల్లో 7.40 లక్షలపై చిలుకు ఓటర్లుండగా... సింహభాగం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గంలో 85శాతానికి పైగా ఓటర్లకు ఓటరు స్లిప్పులు అందించారు. గత అసెంబ్లీ నియోజకవర్గంలో 48.75 శాతం ఓటింగ్ నమోదైంది. దీంతో పార్లమెంటు ఎన్నికల్లో గణనీయంగా ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలను నిర్వహించారు. ఐటీ కంపెనీలుండటం శని, ఆదివారాలు సెలవులు రావడంతో కొందరు తీర్థయాత్రలు, ఇతర కార్యక్రమాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతుంటారు. అయితే ఏ మేరకు ఓటింగ్‌పై ప్రభావం పడనున్నదోనన్న సందేహం అధికారులు, నాయకుల్లో నెలకొన్నది.

కుత్బుల్లాపూర్‌లో యంత్రాంగం సిద్ధం

కొంపల్లి ప్రభుత్వపాఠశాల పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్ శ్రీహరి

జగద్గిరిగుట్ట/కుత్బుల్లాపూర్,మే12: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. అభ్యర్థుల భవితవ్యం తేల్చేందుకు ఓటర్లూ సమయాత్తమవుతున్నారు. తమకు కేటాయించిన యంత్రాలు, సామాగ్రిని ఆదివారం సాయంత్రం అందజేయగా.. సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈ ప్రాంతం నుంచి ఎంపీగా రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించడం, అన్ని చోట్లా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఉండటంతో రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యత సంతరించుకుంటున్నది. బీఆర్ఎస్ నుంచి రాగిడిలక్ష్మారెడ్డి, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, కాంగ్రెస్ నుంచి సునీతా రెడ్డి తోపాటు మొత్తం 22 మంది బరిలో ఉన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో మొత్తం 37.80 లక్షల ఓటర్లు ఉండగా.. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ స్థానం పరిధిలో 7.25లక్షల మంది ఉన్నారు. ఇందులో పురుషులు 3,78,362 మంది, స్త్రీలు 3,46,468 కాగా, ఇతరులు 162 మొత్తం 7,24,992 నమోదయ్యారు. నగర, గ్రామీణ కలయితో పాటు పారిశ్రామిక వాడలున్న కుత్బుల్లాపూర్‌లో తెలంగాణాలోని అన్ని జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల జనాభా కూడా అధికమే. ముస్లిం మైనార్టీలకు సుమారు లక్షకు పైగా ఓట్లున్నాయి. మొత్తం 592 పోలింగ్ కేంద్రాల్లో 67 సమస్యాత్మకంగా గుర్తించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒకటి చొప్పున సుమారు 600 సీసీ కెమెరాలతో, పోలీసులు డీజీపీ కార్యాలయంలోని కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ద్వారా పోలింగ్ పూర్తయ్యి ఈవీఎంలు స్ట్రాంగ్‌రూంకు పంపే వరకు వెబ్‌క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నారు. సాంకేతిక సమస్యలకు ప్రత్యామ్నాయంగా 20శాతం అదనపు ఈవీఎంలు అందుబాటులో ఉంచారు. వేసవి నేపథ్యంలో పోలింగ్‌కేంద్రాల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ పాకెట్లు , వికలాంగులు వయోవృద్ధులకు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచుతున్నారు. అంబులెన్స్‌తోకూడిన వైద్యసిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఆయా కేంద్రాల్లోని సిబ్బందితోపాటు కోడాఫ్‌కండక్ట్ , పైయింగ్‌స్క్వాడ్, అదనపు ఈవీఎంలతో సెక్టోరియల్, పోలీసు అధికారులు విధుల్లో ఉంటారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగే ఓటింగ్ పూర్తయ్యాక ఈవీఎం, వీవీప్యాట్ బాక్స్‌లను సుచిత్రాస మీపంలోని అల్వాల్‌పరిధి లయోలా జూనియర్ కాలేజీలో భద్రపరుస్తారు.

స్వేచ్ఛగా ఓటింగ్‌లో పాల్గొనండి..

కుత్బుల్లాపూర్ పరిధిలో లోక్‌సభ ఎన్నికలు సుజావుగా జరిగేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయా కేంద్రాల్లో ఎన్నికల అధికారులు, పోలీసు యంత్రాంగంతో పర్యవేక్షిస్తాం. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు వేయవచ్చు. నమోదైన ప్రతిఒక్కరూ తమ హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి.

– పులి సైదులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కుత్బుల్లాపూర్

ఘనంగా కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి జన్మదినం

కార్పొరేటర్ రవీందర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

బాలానగర్ , మే 12 : బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని అభిమానులు, శ్రేయోభిలాశుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం బాలానగర్ వినాయక్‌నగర్‌లోని ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో అభిమానులు, శ్రేయోభిలాశులు గజమాలలు, పూలదండలు, శాలువాలతో ఆయనను ముంచెత్తారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ కో ఆర్డినేటర్ సతీశ్ అరోర, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌లతో పాటు డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

పరమశివుడే ఆదిశంకరాచార్యులు

కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 12 : దివినుండి భువికి దిగివచ్చిన పరమశివుడే ఆదిశంకరాచార్యులని.. సనాతన హిందూ ధర్మ పునరుద్ధరణ కోసం కృషి చేశారని కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లోని శ్రీ సిద్ధివినాయక భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవాలయంలో శ్రీజగద్గురు ఆదిశంకరాచార్యుల భక్త మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదిశంకరాచార్యుల జయంతిలో కార్పొరేటర్ శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో భాగంగా నాలుగు రోజుల పాటు వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో గరికపాటి నరసింహారావు ప్రవచనాలు, చివరి రోజున డాక్టర్ రామ్‌సింగ్ ప్రవచనాలను భక్తులు శ్రద్ధగా విన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, కోదండరామయ్య, భక్తమండలి సభ్యులు పలువురున్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో ఆదిశంకరాచార్యుల జయంతిలో గరికపాటి నర్సింహారావును సన్మానిస్తున్న భక్తమండలి సభ్యులు

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 12 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి. టమాట 17, వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 45, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజి 18, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 18, దొండ 28, చిక్కుడు 55, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 19, క్యాప్సికం 47, ఆలుగడ్డ 31, కీరా 19, దోసకాయ 15, సొరకాయ 9, పొట్లకాయ (1) 18, కందగడ్డ 70, ఉల్లిపొరక 55, ఉల్లిగడ్డ 22, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 7 నుంచి 8, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 28, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు(12) 65 నుంచి 75, మునగకాయ(1) 4 నుంచి 5, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200 గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80 గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్ర

బోడుప్పల్, మే12: వ్యక్తిగత ప్రతిష్టను దిగజారుస్తూ కొంత మంది సంఘ విద్రోహ శక్తులు తనపై అశ్లీల చిత్రాలను పోస్టు చేస్తూ రాజకీయంగా దెబ్బతీయాలని చూస్తున్నారని బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సోషల్ మీడియా, ఇన్‌స్టాగామ్ వేదికగా అసభ్య, అశ్లీల చిత్రాలను తనకు పంపిస్తూ డబ్బులు పంపాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. డబ్బులు పంపడానికి అకౌంట్ నంబర్‌ను సైతం పోస్టు చేశారని తెలిపారు. ఈ మేరకు ఈ నెల 9న మేడిపల్లి పోలీస్‌స్టేషన్ సైబర్‌క్రైమ్‌లో ఫిర్యాదు చేశానని, పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు నృత్యకారుల కూచిపూడి, భరతనాట్య నృత్యాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చెన్నై నుంచి విచ్చేసిన భరతనాట్య కళాకారి రక్షా దేవనాథన్, కూచిపూడి నృత్య గురువులు చూడామణిలు తమ శిష్య బృందాలతో కలిసి నర్తించిన పలు అంశాలను సందర్శకులను ఆద్యంతం అలరించాయి. **– కొండాపూర్, మే 12**

సమాజంలో అమ్మది ప్రత్యేక స్థానం

సమాజంలో అమ్మది ప్రత్యేక స్థానమని లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్ అన్నారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హుడా కాలనీలోని లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ కార్యాలయం వద్ద పలువురు మాతృ మూర్తులకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమాజంలో అమ్మది ప్రత్యేక స్థానమని, దేవుడు అన్ని చోట్ల ఉండలేక అమ్మని సృష్టించాడన్నారు. అమ్మ ప్రేమ లోకంలో దొరకలేనిదని చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాతృ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మారాం వెంకటేశ్వర్లు గుప్తా, మధుసుదన్ రెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. **– మాదాపూర్, మే 12**

PUBLIC NOTICE

The General public are hereby informed that my client **SRI. Srujan Gottemuk